# సాక్షి అనంతపురం

ఆదివారం । 3 । ఆగస్టు । 2025






**చీనీ టన్ను రూ.15 వేలు**

అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.15 వేలు పలికాయి.



**టమాట కిలో రూ.40**

అనంతపురం కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.40 పలికింది. కనిష్టం రూ.24, సరాసరి రూ.32 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

**గరిష్టం/కనిష్టం 36.7°/21.4°**

జిల్లా అంతటా శనివారం పగటి ఉష్ణోగ్రతలు పెరగగా, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోద య్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడ తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

## న్యూస్‌రీల్

### అర్హులందరికీ 'అన్నదాత సుఖీభవ'

- ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ



మెగా చెక్ అందజేస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్

**కూడేరు:** అర్హులందరికీ 'అన్నదాత సుఖీభవ' అందుతుందని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ తెలిపారు. శనివారం కూడేరులోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ లలితమ్మ అధ్యక్షతన నిర్వహించిన 'అన్నదాత సుఖీభవ–పీఎం కిసాన్' ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 2,75,642 మంది రైతు కుటుంబాలకు రూ.192.95 కోట్ల మేర లబ్ధి చేకూరిందన్నారు. 'అన్నదాత సుఖీభవ' కింద రూ.137.82 కోట్లు, 'పీఎం కిసాన్' కింద రూ.55.13 కోట్ల చొప్పున రైతుల ఖాతాల్లో జమ కానుందన్నారు. సాంకేతిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్న రైతులకు కూడా లబ్ధి చేకూర్చాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కూడేరు మండలంలో 9,454 మంది రైతు కుటుంబాలకు రూ.6.62 కోట్లకు సంబంధించి మెగా చెక్ అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జిల్లా అధికారిణి ఉమామహేశ్వరమ్మ, ఏడీ అల్తాఫ్ బాషా, తహసీల్దార్ మహబూబ్ బాషా, ఏఓ శుభకర్ రైతులు పాల్గొన్నారు.

### మత్తు బిస్కెట్ల పట్టివేత



నిందితుడిని అరెస్టు చూపుతున్న పోలీసులు

**అనంతపురం సిటీ:** రైల్లో తరలిస్తున్న మత్తు బిస్కెట్లను పోలీసులు పట్టివేశారు. ఒడిశా నుంచి బెంగళూరుకు రైళ్లలో నిషేధిత పదార్థాలు తరలిస్తున్నారన్న పక్కా సమాచారంతో అనంతపురం పోలీసులు శనివారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఒడిశా నుంచి బెంగళూరుకు వెళ్తున్న ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైలు అనంతపురం రైల్వే స్టేషన్ చేరుకోగానే జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్, ఈగల్ సెల్, మూడో పట్టణ పోలీసులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఒడిశాకు చెందిన అశోక్‌కుమార్ సాల్మన్ అనే ప్రయాణికుడి బ్యాగును తనిఖీ చేయగా.. అందులో మత్తు పదార్థాలు కలిగిన 210 బిస్కెట్లు కనిపించాయి. వాటిని స్వాధీనం చేసుకున్న అనంతరం నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### 'ఉద్యాన' ప్రోత్సాహకాలపై దృష్టి సారించండి



ఏడీ దేవానందతో కలిసి హెచ్‌ఓలతో సమావేశమైన ఉద్యానశాఖ డీడీ ఉమాదేవి

**అనంతపురం అగ్రికల్చర్:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26)లో ఉద్యాన పథకాల ఫలాలు, ప్రోత్సాహక రాయితీలు పూర్తి స్థాయిలో రైతులకు అందించడంపై దృష్టి సారించాలని ఉద్యాన శాఖ డీడీ డి.ఉమాదేవి ఆదేశించారు. శనివారం నగరంలోని ఉద్యానశాఖ కార్యాలయంలో ఏడీ దేవానంద్‌కుమార్‌తో కలిసి హార్టికల్చర్ ఆఫీసర్స్ (హెచ్‌ఓ)తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంఐడీహెచ్, ఆర్‌కేవీవై, ఆయిల్‌పామ్, బ్యాంబూ మిషన్ కార్యక్రమాల కింద వివిధ పథకాల అమలుకు రూ.12.86 కోట్ల బడ్జెట్ కేటాయించారన్నారు. కొత్త తోటల విస్తరణ, పాత తోటల పునరుద్ధరణ, యాంత్రీకరణ, పోస్ట్ హార్వెస్టింగ్, ఫారంపాండ్లు, ప్యాక్‌హౌస్, పాలీహౌస్, కోల్డ్ రూం, కోల్డ్ స్టోరేజీ, సోలార్ డ్రయ్యర్స్, రైపనింగ్ చాంబర్స్, ప్రొటెక్టెడ్ కల్టివేషన్ తదితర అన్ని రకాల పథకాల అమలుకు అవకాశం ఉందన్నారు. ప్రధానంగా ప్యాక్ హౌస్‌లకు రూ.2 లక్షల రాయితీ ఉంటుందన్నారు. అలాగే వ్యక్తిగత ఫారంపాండ్లకు రూ.75 వేలు, కమ్యూనిటీ ఫారంపాండ్ల నిర్మాణానికి రూ.18 లక్షలు, సోలార్ కోల్డ్ రూంలకు రూ.4.38 లక్షలు, రైపనింగ్ చాంబర్స్‌కు రూ.21 లక్షలు, కోల్డ్ రూంలకు రూ. 5.25 లక్షలు, సోలార్ డ్రయ్యర్స్‌కు రూ.లక్ష ఇలా... రాయితీలు రైతులు సద్వినియోగం చేసుకునేలా, పూర్తి స్థాయి బడ్జెట్ ఖర్చు చేయడానికి ప్రణాళికబద్ధంగా పనిచేయాలని ఆదేశించారు. ఈ–క్రాప్ నమోదు ఖచ్చితంగా జరిగేలా పర్యవేక్షణ కొనసాగించాలన్నారు.

# మాయమై పోతున్నది

- కబ్జా కోరల్లో పెన్నా
- ఇష్టారాజ్యంగా నిర్మాణాలు
- ఆక్రమిత భూములను అమ్మకానికి పెట్టిన ప్రబుద్ధులు
- కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజల విజ్ఞప్తి



తాడిపత్రి సమీపంలోని కొత్త బ్రిడ్జి వద్ద పెన్నా నదిని ఆక్రమించి సాగు చేసిన పంటలు

**తాడిపత్రి రూరల్:** పెన్నా నది కబ్జాదారుల కోరల్లో చిక్కిశల్యమైపోతోంది. వేగంగా రూపురేఖలు కోల్పోతోంది. నదిని చెరబట్టిన కొందరు ఇష్టారాజ్యంగా భవన నిర్మాణాలు చేపట్టారు. ఆక్రమించిన భూములను పలువురు ప్రబుద్ధులు అమ్మకానికి పెట్టారు. తాడిపత్రి ప్రాంతంలో ఒకప్పుడు అర కిలోమీటరు వెడల్పున ప్రవహించిన నది నేడు పిల్ల కాలువలా మారిందంటే ఆక్రమణలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. ఈ క్రమంలో పెన్నానదికి భారీగా వరద వస్తే తాడిపత్రి మున్సిపాలిటీకి పెనుముప్పుగా పరిణమించే అవకాశం లేకపోలేదు. గతంలో వరద ముప్పు నుంచి రక్షించేందుకు కోట్లాది రూపాయల వ్యయంతో దాదాపు రెండు కిలోమీటర్ల మేర నిర్మించిన కట్టడం నేడు పలు చోట్ల దెబ్బతిన్న నేపథ్యంలో ముప్పు తీవ్రత మరింత పెరిగింది.

**1,800 ఎకరాల్లో కబ్జా**

తాడిపత్రి మండలంలో 1,800 ఎకరాల్లో పెన్నా నది కబ్జాకు గురైందని తేలింది. ఎక్కువగా మునిసిపాలిటీ పరిధిలో, ఆ తర్వాత కొత్త బ్రిడ్జి, పాత బ్రిడ్జిల వద్ద నది దురాక్రమణకు గురైంది. కబ్జా చేసిన భూమిలో పండ్ల తోటలను సాగు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మరికొందరు ఆక్రమించిన భూమిలో నుంచి ఇసుక కొల్లగొడుతున్నారు. ఈ క్రమంలో పెన్నానది పరిసరాల్లో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. ఒకప్పుడు తాడిపత్రి మునిసిపాలిటీ ప్రజల దాహార్తిని పెన్నానది తీర్చేది. అయితే, నదిలో ఆక్రమణలు పెరిగిపోవడంతో నీటి లభ్యత తగ్గి, గండికోట నీటిపై ఆధారపడాల్సిన దుస్థితి నెలకొంది.

**ఆక్రమణలను తొలగించాలి**



పెన్నానదిలో ఆక్రమణలను తొలగించాలి. కేవలం సమావేశాలు, సమీక్షలకు అధికారులు పరిమితం కాకూడదు. రాజకీయ ఒత్తిళ్లకు తల వంచకూడదు. ఆక్రమణలను తొలగిస్తే తాగు, సాగు నీటికి ఢోకా ఉండదు.

– రంగయ్య, సీపీఐ నేత, తాడిపత్రి

**సర్వే నిర్వహిస్తాం**



కలెక్టర్ ఆదేశాలతో పెన్నానది ఆక్రమణల తొలగింపునకు సంబంధించి కార్యాచరణ నివేదిక తయారు చేస్తాం. ముందుగా అధికార బృందంతో పెన్నానదిలో ఆక్రమణలను స్వయంగా వెళ్లి పరిశీలిస్తాం. సర్వేలు జరిపి ఏమేరకు కబ్జాకు గురైందో తెలుసుకుంటాం.

– సోమశేఖర్, తహసీల్దార్, తాడిపత్రి



పామిడి: తెలుగు తమ్ముళ్ల ఇసుక తవ్వకాలతో పెన్నాలో ఏర్పడిన గుంతలు

### నదిలోనే వరిమళ్లు.. పూల తోటలు..

**పామిడి:** మండలంలోనూ పెన్నానది ఆక్రమణకు గురైంది. నదిలోనే వరిమళ్లు, పూల తోటలు, ఇటుక బట్టీలు పుట్టుకొచ్చాయి. దీనికితోడు 'తెలుగు తమ్ముళ్లు' ఇసుక కోసం విచ్చలవిడిగా తవ్వేస్తుండడంతో నది రూపురేఖలే మారిపోయాయి. ఆక్రమణల కారణంగా పెన్నానదికి వరదల సమయంలో పామిడిలో లోతట్టు ప్రాంతాలైన బీసీ కాలనీ, నెహ్రూకాలనీ, సీఎస్ఐ చర్చి కాలనీ, మదీనా కాలనీ, వెంగమనాయుడు కాలనీ, చైతన్యకాలనీ, వీకే ఆదినారాయణరెడ్డి కాలనీ, నాయీ బ్రాహ్మణ కాలనీలు జలమయమవుతున్నాయి.అక్రమంగా ఇసుక తోడేయడంతో ఏర్పడ్డ గుంతలు ప్రజల ప్రాణాలను హరిస్తున్నాయి. పామిడిలోని సర్వే నంబర్ 1,247లో పెన్నానది మొత్తం విస్తీర్ణం 968.18 ఎకరాలు కాగా, ఇందులో 410 ఎకరాల మేర ఆక్రమణకు గురైనట్లు తెలిసింది. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



పామిడి: నదిలో సాగు చేసిన పూల తోట

### కూటమి ప్రభుత్వం చేసిందేమీ లేదు

- 'ఫ్యాప్టో' ధర్నాలో నాయకుల ధ్వజం



ఐక్యత చాటుతున్న ఫ్యాప్టో నాయకులు

**అనంతపురం అర్బన్:** ''కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు చేసిందేమీ లేదు. 11వ పీఆర్‌సీ బకాయిలు, పెండింగ్ డీఏల ఊసే లేదు. 12వ పీఆర్‌సీ ఏర్పాటు చేయలేదు.కనీసం సమస్యలు చెప్పుకునేందుకు ముఖ్యమంత్రి సమయం కూడా ఇవ్వడం లేదు'' అంటూ 'ఫ్యాప్టో' నాయకులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. డిమాండ్ల సాధనకు శనివారం కలెక్టరేట్ ఎదుట ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో జిల్లా చైర్మన్ శ్రీనివాస నాయక్, ప్రధాన కార్యదర్శి పురుషోత్తం మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటై ఏడాది దాటినా పీఆర్‌సీ ఊసేలేదన్నారు. 12వ వేతన సవరణ సంఘం అమలు గడువు ఆలస్యమైనందున వెంటనే 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. నూతన వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయాలన్నారు. మూడు డీఏలను ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిందని, ఇప్పటికే మంజూరైన డీఏ బకాయిలు, 11వ పీఆర్‌సీ బకాయిలూ చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. 2004 సెప్టెంబరు 1కి ముందు విడుదలైన నోటిఫికేషన్ ద్వారా నియామకం పొందిన వారందరికీ కేంద్ర ప్రభుత్వ మెమో 57 అమలు చేసి పాత పెన్షన్ విధానంలోకి తీసుకురావాలన్నారు. ఉపాధ్యాయులపై పీ–4 కార్యక్రమం బలవంతంగా రుద్దడమేమిటని ప్రశ్నించారు. పంచాయతీ రాజ్ యాజమాన్యంలో పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలు తక్షణమే చేపట్టాలన్నారు. అనంతరం డీఆర్‌ఓ ఎ.మలోలను నాయకులు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ధర్నాకు వైఎస్సార్‌టీయూ నాయకులు నాగిరెడ్డి, శ్రీధర్‌గౌడ్, ఎంఈఓ–2 సంఘం నాయకులు రామచంద్ర, పీడీ సంఘం అక్కులప్ప తదితరులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో 'ఫ్యాప్టో' కో–చైర్మన్లు ఓబుళేసు, లింగమూర్తి, డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు రమణారెడ్డి, వెంకటేష్, కార్యదర్శి రత్నం, కోశాధికారి రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.


# మార్కు కోల్పోవాల్సిందేనా?

- మెగా డీఎస్సీ ఎస్జీటీ పరీక్షలో ఓ ప్రశ్నకు తప్పు సమాధానం
- అభ్యంతరం తెలిపినా పరిష్కరించలేదంటున్న అభ్యర్థులు

**అనంతపురం ఎడ్యుకేషన్:** మెగా డీఎస్సీ ఎస్జీటీ పరీక్షలో ఓ ప్రశ్న తప్పుగా ఇచ్చారు. దీనిపై అభ్యర్థులు అభ్యంతరం తెలిపినా పట్టించుకోలేదు. ఫైనల్ 'కీ' కూడా విడుదల చేశారు. ఈ 'కీ' తర్వాత ఎలాంటి అభ్యంతరాలు స్వీకరించబోమని స్పష్టం చేయడంతో అభ్యర్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

**ఏంటా ప్రశ్న...?**

ఎస్జీటీ పరీక్షల్లో భాగంగా జూలై 2న మధ్యాహ్నం జరిగిన పరీక్షలో 41వ ప్రశ్నగా 'తిక్కనకు సంబంధించి కింది వాటిలో సరికానిది' అని అడిగారు. సమాధానాలు.. 'అ–మనుమసిద్ధి ఆస్థానంలో మంత్రిగా పనిచేశారు, ఆ–నిర్వచనోత్తర రామాయణం వీరి రచన, ఇ–మహాభారతంలో అరణ్యపర్వం నుంచి మహాప్రస్థానిక పర్వం వరకు రచించారు. ఈ–నాటకీయత వీరి కవితా లక్షణం' అని ఇచ్చారు. కీలో సమాధానం 'అ,ఆ,ఈ' అని ఇచ్చారు. ఇది తప్పు అని అభ్యర్థులు చెబుతున్నారు. 8వ తరగతి తెలుగువాచకం 146వ పేజీలో 'ఆతిథ్యం' అనే పాఠంలో ఈ విషయం స్పష్టంగా ఉండడం గమనార్హం. తిక్కన 'మనుమసిద్ధి ఆస్థానంలో మంత్రిగా పని చేశారు, నిర్వచనోత్తర రామాయణం రచించారు, ఈయన శైలి నాటకీయం' అని ఆ పాఠంలో స్పష్టంగా ఉంది. అంటే ఈ ప్రశ్న 'తిక్కనకు సంబంధించి కింది వానిలో సరైనది' అని అడిగిఉంటే వారు ఇచ్చిన సమాధానం సరిపోయేది. వారు అడిగిన ప్రశ్నకు సరైన సమాధానం ఆప్షన్లలో లేనేలేదు. దీనిపై ఆధారాలతో సహా అభ్యంతరాలు తెలిపినా అధికారులు పరిగణనలోకి తీసుకోకుండా ఫైనల్ కీ విడుదల చేశారు. ఈ క్రమంలో తాము అరమార్కు నష్టపోవాల్సి వస్తోందని అభ్యర్థులు వాపోతున్నారు. అరమార్కుతోనే వందలాది మంది అభ్యర్థుల ర్యాంకులు మారిపోతాయంటున్నారు. ప్రశ్నకు సమాధానం తెలీక... అదృష్టం కొద్దీ 'అ,ఆ,ఈ' సమాధానం ఇచ్చిన వారికి మార్కు వస్తుంది. అలాకాకుండా ఏళ్ల తరబడి రేయింబవళ్లు చదువుకుని పూర్తిగా అవగాహన ఉండి తప్పుగా ఇచ్చిన ప్రశ్నకు సమాధానం పెట్టలేని అభ్యర్థులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రశ్నకు మార్కు యాడ్ చేయాలని కోరుతున్నారు.



జూలై 2న మధ్యాహ్నం పరీక్షలో అడిగిన 41వ ప్రశ్న... 'కీ'లో కరెక్ట్ సమాధానంగా 4–'అ,ఆ,ఈ' ఇచ్చిన దృశ్యం

# ఈ ఉపాధ్యాయుడు మాకొద్దు

- గుండిగానిపల్లి తెలుగు టీచర్‌పై విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదు

**బ్రహ్మసముద్రం:** విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న ఉపాధ్యాయుడు తమకొద్దు అంటూ విద్యార్థులు, తల్లిదండ్రులు ముక్తకంఠంతో నినదించారు. విద్యార్థులు, తల్లిదండ్రుల కథనం మేరకు... బ్రహ్మసముద్రం మండలంలోని గుండిగానిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఆర్. వేమనారాయణ విద్యార్థినులను అసభ్య పదజాలంతో దూషిస్తున్నారు. బాలికలపై చేతులు వేస్తూ అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. మాట్లాడేందుకంటూ విద్యార్థినుల ఫోన్ నంబర్లు ఇవ్వమంటున్నారు.ఇవ్వకపోతే ఇష్టమొచ్చినట్లు కొడుతునారు. ఇటీవల విద్యార్థులు తిరగబడడంతో మెడికల్ లీవ్‌పై వెళ్లిపోయిన ఆయన.. రెండు రోజుల క్రితం తిరిగి విధులకు హాజరయ్యారు. కానీ, పాత బుద్ధి మాత్రం పోనిచ్చుకోకుండా విద్యార్థినులతో మళ్లీ అసభ్యంగా ప్రవర్తించడం మొదలుపెట్టారు. దీంతో విసిగిపోయిన విద్యార్థినులు ఈ విషయాన్ని తల్లిదండ్రులకు తెలపగా.. శనివారం వారు పాఠశాలకు చేరుకుని ఆందోళనకు దిగారు. ఉపాధ్యాయుడు వేమనారాయణపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ హెచ్‌ఎం సుహాసినికి వినతి పత్రం అందజేశారు. మండల విద్యాశాఖ అధికారి దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు తల్లిదండ్రులు తెలిపారు.




గుండిగానిపల్లి హైస్కూల్

# కసాపురం.. భక్తజనసాగరం



వజ్రకవచ అలంకరణలో నెట్టికంటి ఆంజనేయస్వామి

**గుంతకల్లు రూరల్:** శ్రావణమాసం రెండో శనివారం సందర్భంగా కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం భక్తులతో పోటెత్తింది. ఆంజనేయస్వామి నామస్మరణతో పురవీధులు మార్మోగాయి.సీతారామలక్ష్మణులు హనుమంత వాహనంపై కొలువుదీరి ఆలయ పురవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. శనివారం వేకువజామునే నెట్టికంటుడికి మహాభిషేకాలు నిర్వహించిన అర్చకులు స్వామి వారిని వజ్రకవచ అలంకరణలో తీర్చిదిద్దారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. స్వామి వారిని దర్శించుకునేందుకు కర్ణాటక, తెలంగాణ నుంచి కూడా భక్తులు భారీగా తరలివచ్చారు. భక్తులకు బెల్డోణ సత్రంలో అన్నదానం చేపట్టారు. సాయంత్రం సీతారామలక్ష్మణులను హనుమంత వాహనంపై కొలువుదీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పల్లకీలో ఆలయం చుట్టూ ప్రాకారోత్సవం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కే.వాణి, ఏఈఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



హనుమద్ వాహనంపై ఊరేగుతున్న సీతారామలక్ష్మణులు

### రేపు, ఎల్లుండి వర్షసూచన

**అనంతపురం అగ్రికల్చర్:** అనంతపురం,శ్రీ సత్యసాయి జిల్లాల్లో సోమ,మంగళ వారాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం పడే సూచనలు ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.విజయశంకర బాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 40 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులతో పాటు ఉరుములు, మెరుపులు సంభవించే అవకాశం ఉందన్నారు. శ్రీ సత్యసాయి జిల్లాలో ఆదివారం కూడా వర్షం పడవచ్చన్నారు. చాలా ప్రాంతాల్లో మోస్తరు వర్షంతో పాటు ఒకట్రెండు ప్రాంతాల్లో భారీ వర్షం పడే సూచన ఉందని పేర్కొన్నారు.

### పంటల బీమా గడువు పెంపు

**అనంతపురం సెంట్రల్:** ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై), వాతావరణ పంటల బీమా(ఆర్‌డబ్లూబీసీఐఎస్) గడువును ఈనెల 14 వరకూ పొడిగించినట్లు జిల్లా వ్యవసాయాధికారి ఉమా మహేశ్వరమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే రెండు దఫాలుగా గడువు పొడిగించినట్లు వివరించారు. జూలై 31తో గడువు ముగిసిందన్నారు. అయితే జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల వలన వివిధ పంటల సాగుకు ఇంకా సమయం ఉందని, దీని దృష్టిలో పెట్టుకొని గడువు పెంచాలని వ్యవసాయశాఖ కమిషనరేట్ అధికారులకు విజ్ఞప్తి చేసినట్లు వివరించారు. ఈ నేపథ్యంలో బీమా గడువు పొడిగిస్తూ ఉత్తర్వులు వచ్చినట్లు తెలిపారు. రుణం తీసుకోని రైతులకు ఈనెల 14 వరకూ, రుణం తీసుకున్న వారికి ఈనెలాఖరు వరకూ అవకాశం కల్పించారని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

### రేపు కలెక్టరేట్‌లో పరిష్కార వేదిక



**అనంతపురం అర్బన్:** ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఈనెల 4వ తేదీ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ తెలిపారు. రెవెన్యూ భవన్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని, ప్రజలు తమ సమస్యలను అర్జీ రూపంలో సమర్పించాలని సూచించారు. గతంలో అర్జీ ఇచ్చి ఉంటే దానికి సంబంధించి రసీదు తీసుకురావాలన్నారు. సమర్పించిన అర్జీల స్థితిని కాల్‌సెంటర్ 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. అర్జీలను meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఆన్‌లైన్‌లోనూ సమర్పించవచ్చని తెలిపారు.

## క్లుప్తంగా

### 12, 13 తేదీల్లో సీపీఐ జిల్లా మహాసభలు



పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

అనంతపురం అర్బన్: సీపీఐ జిల్లా మహాసభలు ఈ నెల 12, 13 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జాఫర్ తెలిపారు. శనివారం నగరంలోని నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా జాఫర్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. విద్యుత్ చార్జీల భారాన్ని ప్రజలపై మోపిందన్నారు. పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్ల ఇంటిస్థలం ఇస్తామని చెప్పి ఏడాదైనా అమలు చేయలేదని మండిపడ్డారు. ప్రజాసమస్యలపై మహాసభల్లో విస్తృతంగా చర్చించి వాటి పరిష్కారానికి ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శులు నారాయణస్వామి, మల్లికార్జున, కార్యదర్శివర్గ సభ్యులు రాజారెడ్డి, నగర కార్యదర్శి శ్రీరాములు, కార్యవర్గ సభ్యులు లింగమయ్య, కత్తి నారాయణస్వామి, రాజేష్ గౌడ్, సంతోష్‌కుమార్, పద్మావతి, అల్లీపీరా, పెద్దయ్య, కుళ్లాయిస్వామి పాల్గొన్నారు.

### 5న విద్యుత్ కార్యాలయాల వద్ద నిరసన

అనంతపురం అర్బన్: విద్యుత్ చార్జీల పెంపుతో ప్రజలను దోపిడీ చేయడాన్ని నిరసిస్తూ ఈ నెల ఐదో తేదీన విద్యుత్, ప్రభుత్వ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వామపక్ష పార్టీల నాయకులు తెలిపారు. శనివారం సీపీఎం జిల్లా కార్యాలయంలో వామపక్ష పార్టీల నాయకులు సమావేశం నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప, సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, ఎస్‌యూసీఐ జిల్లా కార్యదర్శి రాఘవేంద్ర, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకుడు నాగరాజు మాట్లాడారు. విద్యుత్ చార్జీలు పెంచబోమని, తగ్గిస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు, కూటమి నాయకులు హామీ ఇచ్చారన్నారు. స్మార్ట్ మీటర్లు పగులకొట్టాలని ప్రతిపక్షంలో ఉండగా పిలుపునిచ్చారన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత సర్దుబాటు చార్జీల పేరుతో రూ.15,485 కోట్లు భారం మోపిందన్నారు. ఈ ఒక్క ఏడాదిలోనే రూ.2,787 కోట్లు అదనపు భారం వేశారన్నారు. ఈ భారాలను కప్పిపుచ్చి రూ.460 కోట్లు ట్రూడౌన్ ద్వారా తగ్గిస్తున్నట్లు నమ్మబలుకుతున్నారని విమర్శించారు. తాజాగా మరో రూ.12,700 కోట్లు భారాన్ని వినియోగదారులపై మోపనుందన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజారెడ్డి, నాగేంద్రకుమార్, నాగమణి, బాలరంగయ్య, శ్రీరాములు, రామాంజనేయులు, వీరనారప్ప, తదితరులు పాల్గొన్నారు.

# తరాల స్నేహం.. తరగిపోని బంధం




## నేడు స్నేహితుల దినోత్సవం

అనంతపురం కల్చరల్: తల్లిదండ్రులు, ఇతర బంధువులను భగవంతుడే ఇస్తాడు. మంచి స్నేహితులను మాత్రం మనమే ఎంచుకోవాలి. కష్టాల్లో సైతం ముందుండి నడిపించేవారే నిజమైన స్నేహితులనే సామెత మైత్రీ బంధానికి అద్భుతమైన నిర్వచనం. ఆ భావనకు ఎంతోమంది సజీవ సాక్ష్యంగా నిలుస్తున్నారు. నిష్కల్మషమైన స్నేహబంధాన్ని ఆస్వాదిస్తున్నారు. టెక్నాలజీ పెరిగిపోతున్న తరుణంలో వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ గ్రూపులతో గతానికి భిన్నమైన దగ్గరితనాన్ని చవిచూస్తున్నారు. మాటల్లో చెప్పలేని స్నేహం విలువను తెలియజేయడానికి చరిత్రలో ఓ రోజును కేటాయించారు. ఆగస్టులో వచ్చే తొలి ఆదివారాన్ని స్నేహితుల దినోత్సవంగా జరుపుకుంటున్నాము.

### ప్రత్యేక కలయిక

స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆదివారం డెబ్బై ఏళ్ల దాటిన మిత్రులందరితో కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక కలయిక పేరిట నగరంలోని లెక్చరర్స్ కాలనీలో సమావేశానికి ఏర్పాట్లు చేశారు. బాల్యంలో స్నేహితులతో ఎలా ఉత్సాహంగా ఉన్నారో.. వృద్ధాప్యం మీద పడినా అదే హుషారుతో సంతోషంగా సాగేలా ప్రత్యేక కార్యక్రమాలకు రూపకల్పన చేశారు. స్నేహితుల్లో కళాకారులుగా ఉన్నవారు ఆటపాటలు, పద్యాలు, చర్చలతో ఉదయం నుంచి సాయంత్రం దాకా 'భారత్ రైతు ప్రజా సంక్షేమ సంఘం కార్యాలయం' వేదికగా స్నేహితుల దినోత్సవం నిర్వహించనున్నట్లు కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

### స్నేహ హస్తం.. స్ఫూర్తి మంత్రం



అనంతపురంలోని శ్రీపొట్టి శ్రీరాములు హై స్కూల్లో 1984 సంవత్సరంలో చదువుకున్న వారంతా ఒక బాస చేసుకున్నారు. హైస్కూలు వీడి వెళ్లినా అందరూ కలుస్తుండాలని. ఎన్ని సమస్యలు ఉన్నా వీలైనప్పుడల్లా కలవాలని. అలా కలయిక మొదలైంది. 2012లో ప్రత్యేకంగా ఒక గ్రూపు ఏర్పాటు చేసుకుని ప్రతినెలా కృష్ణకళామందిరంలో సమావేశమై సాదకబాధకాలు చర్చించుకుంటున్నారు. ఈ గ్రూపులో వందమందికి పైగా ఉన్నారు. వీరిలో ఎవరికి ఏ కష్టం వచ్చినా మిగతా స్నేహితులంతా స్పందించి సాయం అందిస్తూ.. నేటికీ అదే స్ఫూర్తితో ముందుకు సాగుతున్నామని గ్రూపు నిర్వాహకులు యమ్మనూరు చంద్రశేఖర్, జయసింహ, రామకృష్ణ చెబుతున్నారు.

### అపూర్వ స్నేహితులు





కొర్రపాడుకు చెందిన అక్కులప్ప, ఉరవకొండకు చెందిన తిమ్మారెడ్డిది అపూర్వమైన స్నేహబంధం. అనంతపురంలోని హైస్కూల్‌లో 6వ తరగతి చదివే సమయంలో ఇద్దరూ స్నేహితులయ్యారు. 30 ఏళ్లుగా వీరి స్నేహం చెక్కు చెదరలేదు. అక్కులప్ప పార్ట్‌టైం పీహెచ్‌డీ చేస్తూ, న్యాయవాది వృత్తిని ఎంచుకున్నారు. తిమ్మారెడ్డి ఐబీఎంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. చిన్నపాటి మనస్పర్థలు కూడా లేకుండా వారి స్నేహాన్ని కొనసాగిస్తూ.. స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ఎన్ని సమస్యలు ఉన్నా వీలైనప్పుడు ఇద్దరూ కలుస్తున్నారు. బాల్యంలో ఎలా ఉన్నారో.. ఇప్పుడు కూడా అదే సంతోషంగా సాగేలా కార్యక్రమాలు రూపొందించుకుంటున్నారు. దైవదర్శనాలకు కలిసే వెళ్తున్నారు. ప్రతి పండుగనూ బంధువుల్లా చేసుకుంటామని ఇద్దరూ చెబుతున్నారు.

### సాహిత్యంలో జంట కవులు



అనంతపురం సాహిత్యంలో జంట కవులుగా పేరొందిన రియాజుద్దీన్, జూటూరు షరీఫ్ ఇద్దరూ విశ్రాంత ప్రభుత్వ టీచర్లు. ఆర్ట్స్ కాలేజీలో చదువుకునేప్పటి నుంచి స్నేహ బంధంతో ఒక్కటైన వీరిద్దరూ సాహిత్యంతో మరింత దగ్గరయ్యారు. రియాజుద్దీన్ తెలుగు పండితుడైనా, షరీఫ్ హిందీ పండితుడైనా కవిత్వం వారిద్దరినే కాదు వారి రెండు కుటుంబాలనూ దగ్గర చేసింది. ఎవరికి ఏ కష్టమొచ్చినా మా స్నేహితున్నాడనే భరోసా మాకు ధైర్యాన్ని ఇస్తుందని ఇద్దరూ అంటారు.

### స్వచ్ఛమైన స్నేహం



అనంతపురానికి చెందిన టీఎల్ శారద, ఝాన్సీలది స్వచ్ఛమైన స్నేహ బంధం. వీరి వయసు 60 ఏళ్ల పైబడింది. శారదా మునిసిపల్ హైస్కూల్లో 6వ తరగతి చదివే సమయంలో ఇద్దరూ స్నేహితులయ్యారు. ఇద్దరి జీవితాలలో జరిగే శుభ, అశుభాలన్నింటిలో రెండు కుటుంబాల వారు ఒకరికొకరు తోడుగా ఉంటూ మైత్రీబంధాన్ని ఆస్వాదిస్తున్నారు. మరో విశేషమేమంటే స్నేహాన్ని బంధుత్వంగానూ మార్చుకున్నారు. 'స్నేహమంటే ఇతరుల కోసం ఆలోచించేదేనని అనుకున్నాను కాబట్టే ఇన్నేళ్లయినా పొరపొచ్చలు రాలేదు' అని ఇటీవలే టీచర్‌గా ఉద్యోగ విరమణ చేసిన శారద తెలిపారు.

### స్నేహంలో అనుమానాలొద్దు



అనంతపురంలోని కాంట్రాక్ట్ ఉద్యోగి సైకిలాబ్ రెడ్డి, మల్లికార్జునరెడ్డిది 30 ఏళ్ల స్నేహం. ఏనాడూ చిన్న పట్టింపు లేకుండా వీరి స్నేహం సాగిపోతోందంటే చెప్పుడు మాటలు వినకపోవడం, ఒక వేళ వినాల్సి వచ్చినా ఏనాడూ ఆలోచించకుండా అడుగేసింది లేదు. ఇంట్లో వారందరినీ భగవంతుడే ఇచ్చాడు. మంచి స్నేహాన్ని తామే ఎంచుకోవాలన్న స్పృహతో ఉంటేనే ఏ బంధమైనా కలకాలం ఉంటుందంటున్నారు. సాధారణంగా చాలా స్నేహాలు ఈగోలతో, ఆర్థిక విషయాలలో చెడిపోతుంటాయని, అందరూ అటువంటి వాటికి దూరంగా ఉండాలని తెలిపారు. అప్పుడే స్నేహం వర్ధిల్లుతుంది.

## యాటకల్లులో దొంగల హల్‌చల్



పట్టుబడిన దొంగలు

శెట్టూరు: యాటకల్లులో దొంగలు పట్టపగలే హల్‌చల్ చేశారు. శనివారం సాయంత్రం గ్రామ చివరున్న మోటార్ పంపుసెట్ వైర్లు, స్టార్టర్ బాక్సులను ముగ్గురు దుండగులు తొలగించి ఎత్తుకుపోతుండగా.. అటుగా వస్తున్న ఓ రైతు వారిని ఎవరు మీరని వివరాలు అడిగాడు. దీంతో దుండగులు రైతును బెదిరించి ముందుకెళ్లారు. వెంటనే రైతు గ్రామస్తులకు ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. గ్రామస్తులు హుటాహుటిన అక్కడికి చేరుకొని దుండగులను పట్టుకున్నారు. సర్పంచ్ ఈరన్న సమాచారంతో ఎస్‌ఐ రాంభూపాల్ వచ్చి దుండగులను స్టేషన్‌కు తరలించారు. ఇప్పటికే పలుచోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ వైర్లు చోరీకి గురైనట్లు రైతులు తెలిపారు. పోలీసులు విచారించి రైతులకు న్యాయం చేయాలని రైతులు కోరారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతుడు వెంకటరమణ నాయుడు

రాప్తాడురూరల్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి పంచాయతీ బీజేపీ కొట్టాల దారిలో చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు.. యాడికి మండలం రాయలచెరువు గ్రామానికి చెందిన వెంకటరమణనాయుడు (43) బలపంరాయి వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇందులో భాగంగా శుక్రవారం అనంతపురం వచ్చాడు. వచ్చిన పని పూర్తికాలేదని కాటిగానికాలువ గ్రామంలో స్నేహితుడిని కలిసేందుకు వెళ్తున్నట్లు భార్యకు ఫోన్ చేసి చెప్పాడు. అక్కడికి వెళ్లి అర్ధరాత్రి తిరిగి అనంతపురం వచ్చే సమయంలో బీజేపీ కొట్టాలకు వెళ్లే క్రాస్ వద్ద కుక్క అడ్డురావడంతో అదుపుతప్పి కిందపడ్డాడు. తలకు తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వస్తున్న వారు గమనించి అతడిని సర్వజన ఆస్పత్రికి తరలించారు. అప్పటికే వెంకటరమణనాయుడు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. భార్య శ్యామల ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

## ఇద్దరు బీటెక్ విద్యార్థుల దుర్మరణం





మృతులు కార్తీక్, రోహిత్ (ఫైల్)

ముదిగుబ్బ/ కుందుర్పి: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు బీటెక్ విద్యార్థులు దుర్మరణం చెందారు. ఈ ఘటనతో ఉమ్మడి అనంతపురం జిల్లాలోని రెండు కుటుంబాల్లో విషాదం అలుముకుంది. వివరాలిలా ఉన్నాయి. శ్రీసత్యసాయి జిల్లా ముదిగుబ్బలోని నాయీబ్రాహ్మణ వీధికి చెందిన శ్రీనివాసులు కుమారుడు కార్తీక్ (23), అనంతపురం జిల్లా కుందుర్పి మండలం మాయదార్లపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు వలస మూర్తి కుమారుడు రోహిత్ (23) తమిళనాడు రాష్ట్రం మధురైలోని కలసలింగం యూనివర్సిటీలో బీటెక్ చదువుతున్నారు. శుక్రవారం సాయంత్రం వీరిద్దరూ బైక్‌పై యూనివర్సిటీ సమీపంలో వెళ్తుండగా బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో కార్తీక్, రోహిత్ మృతి చెందారు. రోహిత్ జాతీయ స్థాయి రెజ్లింగ్ క్రీడాకారుడు.

## భారత సైన్యానికి ఏటా రూ.10 లక్షల విరాళం



వృద్ధాశ్రమానికి రూ.లక్ష విరాళం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

అనంతపురం కార్పొరేషన్: తమ కుమారుడు ఆలూరు విరాట్ పుట్టిన రోజును పురస్కరించుకుని ప్రతి ఏటా భారత సైన్యానికి ఆలూరు ఫౌండేషన్ ద్వారా రూ.10 లక్షల విరాళం అందిస్తామని వైఎస్సార్‌సీపీ ఎస్‌ఆర్‌ఐ వింగ్ కో ఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి దంపతులు పేర్కొన్నారు. శనివారం కుమారుడి పుట్టిన రోజును పురస్కరించుకుని నార్పలలోని చెన్నకేశవ వృద్ధాశ్రమానికి రూ.లక్ష, బెంగళూరులోని బన్నేరుఘట్ట జూలో ఐదు జంతువులను దత్తత తీసుకుని వాటి పరిరక్షణకు రూ.లక్ష అందజేసినట్లు పేర్కొన్నారు. ఇటీవలే భారత సైన్యానికి రూ.10 లక్షల విరాళం అందజేసినట్లు వెల్లడించారు. పదేళ్లుగా విరాట్ పుట్టిన రోజు సందర్భంగా శింగనమల నియోజకవర్గంలో, కోవిడ్ సమయంలో సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు.



## ప్రైవేట్ భూమిపై వాలిన 'పచ్చ' గద్దలు

- యజమానులను దరిదాపుల్లోకి రానీయని పోలీసులు
- బాధితుల్లో విశ్రాంత న్యాయమూర్తి, మరికొంతమంది



వివాదాస్పద భూమి వద్ద పోలీసుల పహారా

అనంతపురం క్రైం: అధికార తెలుగుదేశం పార్టీ అండతో కొందరు నాయకులు రూ.కోట్లు విలువైన ప్రైవేట్ భూమిని కొట్టేసేందుకు పన్నాగం పన్నారు. ఏకంగా పోలీసుల రక్షణలో భూమిని చదును చేయించడం.. అసలైన ప్లాట్ల యజమానులను దరిదాపుల్లోకి రాకుండా హెచ్చరికలు జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది. జిల్లా కేంద్రంలోనే ఈ ఘటన చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు... అనంతపురం నగర శివారులోని ఎంకేఎం ఫంక్షన్‌హాలు సమీపాన జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న సర్వే నంబరు 209, 210లో మొత్తం 12 ఎకరాలు భూమి ఉంది. ఇందులో గంగాధర, లింగమ్మ, మారెన్న, మంజునాథ, లక్ష్మీదేవితో పాటు పదుల సంఖ్యలో వ్యక్తులకు ప్లాట్లు ఉన్నాయి. విలువైన ఈ స్థలాలపై టీడీపీకి చెందిన పెద్ద మనుషులు కన్నేశారు. సమీప బంధువును ముందుంచి భూమిని కాజేసేందుకు పథకం వేశారు. అందుకు అనుగుణంగా శనివారం మందీమార్బలంతో పాటు పోలీసులను రక్షణగా తీసుకుని సదరు సర్వే నంబర్లలోని భూమిలోకి జేసీబీలతో వచ్చారు. ఇదివరకే అక్కడున్న బండలు, షెడ్లు కూల్చేశారు. ఇదేమిటని ప్రశ్నించిన వారిని పోలీసులు వారి స్థలాన్ని సర్వే చేయించుకుంటున్నారని, ఎవ్వరూ అడ్డు రావద్దని స్పష్టం చేయడంతో వెనక్కు తగ్గారు. తహసీల్దార్ సెలవులో ఉండగా.. సర్వేకు ఎలా అనుమతిచ్చారు? సివిల్ వివాదంలో రక్షణ పేరిట పోలీసులు ఎందుకు తలదూరుస్తున్నారో స్థానికులకు అంతుబట్టలేదు. తమ వద్ద ప్లాట్లకు సంబంధించి డాక్యుమెంట్లు ఉన్నాయని చెబుతున్నా పోలీసు, రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదని బాధితులు తెలిపారు. ప్లాట్లు కబ్జాకు గురవుతున్న బాధితుల్లో విశ్రాంత న్యాయమూర్తి ఒకరు ఉన్నారు. ఆయన ఈ వ్యవహారంపై ఎస్పీని నేరుగా కలిసి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అసలు కబ్జాదారులు ఏ డాక్యుమెంట్లు చూపిస్తే పోలీసులను రక్షణగా పంపించారని ప్రశ్నించినట్లు సమాచారం. స్పందించిన ఎస్పీ డీఎస్పీని విచారణకు ఆదేశించారు. రూ.కోట్లు విలువ చేసే స్థలాలను కబ్జా చేయాలని చూస్తే ఊరుకునేది లేదని బాధితులు స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ స్పందించి న్యాయం చేయకపోతే.. తాము ఆధారాలతో న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని చెప్పారు.

## 'రైతులను బిచ్చగాళ్లుగా చూస్తున్నారు'

గుంతకల్లు: రాష్ట్రంలోని డబుల్ ఇంజిన్ సర్కార్ పాలకులు రైతులను బిచ్చగాళ్లుగా చూస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్ విమర్శించారు. శనివారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితి నెలకొందన్నారు. దీంతో ఒక్క అనంతపురం జిల్లాలోనే 8.55 లక్షలు ఎకరాలకు గాను 3 లక్షల ఎకరాల్లో మాత్రమే విత్తనం వేసినట్లు జిల్లా వ్యవసాయాధికారులు ప్రకటించారన్నారు. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా కోటి ఎకరాల్లో విత్తనం వేయలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత దుర్భర పరిస్థితి నెలకొన్న తరుణంలో అన్నదాత సుఖీభవ కింద మీరు (ప్రభుత్వాలు) రూ.7వేలు ఇచ్చి.. దాన్ని గొప్పగా చెప్పుకుంటున్నారని విమర్శించారు. ఎకరాకు రూ.25వేలు ఇచ్చినా ఆ డబ్బులు రైతులకు సరిపోవన్నారు. సాగుకు అవసరమైన ఎరువులు, క్రిమిసంహారక మందులు 50 శాతం సబ్సిడీతో ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇక హంద్రీ–నీవా కాలువ వెడల్పు చేసిన ఉమ్మడి అనంత జిల్లాకు ఏ మాత్రమూ ప్రయోజనం లేదన్నారు. రాయలసీమ ప్రజలను మరోసారి మోసం చేయడానికి బనకచెర్ల నీటి పథకాన్ని తెరమీదకు తెచ్చారని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు గోవిందు, వీరభద్రస్వామి, బి.మహేష్, గోపీనాథ్, ఎస్ఎండీ గౌస్ పాల్గొన్నారు.

## కళామతల్లి ముద్దుబిడ్డ బళ్లారి రాఘవ



బళ్లారి రాఘవ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ

అనంతపురం అర్బన్: నాటక పితామహుడు బళ్లారి రాఘవ కళామతల్లి ముద్దుబిడ్డ అని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ పేర్కొన్నారు. ఆయన జీవితం తెలుగుజాతికి మణిహారమంటూ కొనియాడారు. జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో బళ్లారి రాఘవ 145వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఇన్‌చార్జ్ కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై బళ్లారి రాఘవ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ బళ్లారి రాఘవ నాటకరంగానికి వన్నె తెచ్చారన్నారు. ఆయన సామాజిక సంఘ సంస్కర్త అని, ఆయన జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని అన్నారు. బళ్లారిలో షేక్స్‌పియర్ క్లబ్ ప్రారంభించి పలు నాటకాలను ప్రదర్శించి ప్రజల మన్ననలు పొందారన్నారు. ఆయన ప్రజ్ఞను గుర్తించిన అప్పటి ఆంగ్ల ప్రభుత్వం పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమించడమే కాకుండా లాల్‌బహదూర్ అనే బిరుదుతో సత్కరించిందన్నారు. సంపన్న కుటుంబానికి చెందినా నిరాడంబర జీవితాన్ని గడిపిన గొప్ప వ్యక్తి బళ్లారి రాఘవ అని అన్నారు. మహనీయుల స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ మలోల, పరిపాలనాధికారి అలెగ్జాండర్, పర్యాటక శాఖ అధికారి జయకుమార్, డీఈఓ ప్రసాద్‌బాబు, డీపీఆర్‌ఓ బాలకొండయ్య, సూపరింటెండెంట్లు యుగేశ్వరి దేవి, రియాజుద్దీన్, కళా సంస్థ ప్రతినిధి మైకెల్ బాబు, కలెక్టరేట్ అధికారులు పాల్గొన్నారు.

### మౌలిక వసతులు తప్పనిసరి

కూడేరు: అహుడా లే అవుట్లలో మౌలిక వసతులు తప్పనిసరిగా ఉండాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ్ స్వామి శర్మ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన కూడేరు, బ్రాహ్మణపల్లిలోని అహుడా లేఅవుట్లను పరిశీలించారు. లేఅవుట్ల చుట్టూ ప్రహరీ నిర్మించాలని, అహుడా లేఅవుట్ తెలిపేలా శాశ్వత హోర్డింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. నిబంధనలను తప్పకుండా పాటించాలని ఆదేశించారు. ఆయన వెంట ఫారెస్టు సెటిల్‌మెంట్ అధికారి రామకృష్ణారెడ్డి,, అహుడా ఈఈ దుశ్యంత్, డీఈ రేవంత్, తహసీల్దార్ మహబూబ్ బాషా, రీసర్వే డీటీ ప్రసాద్, సర్వేయర్ ఆయేషా సిద్ధిఖీ, వీఆర్వో ప్రసాద్ పాల్గొన్నారు.

## జల్సాల కోసం దొంగతనాలు

- ముగ్గురు నిందితుల అరెస్ట్
- జనరేటర్, పాలక్యాన్లు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శేఖర్

రాప్తాడురూరల్: జల్సాలకు అలవాటుపడిన యువకులు అప్పులపాలై.. వాటిని తీర్చుకునేందుకు దొంగలుగా మారి.. చివరకు కటకటాలపాలయ్యారు. ఇటీవల అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ పాల డెయిరీలో రూ.10 లక్షల విలువైన జనరేటర్, 70 అల్యూమినియం పాల క్యాన్లను చోరీ చేసిన కేసులో నిందితులను అనంతపురం రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం రూరల్ పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను సీఐ శేఖర్ వెల్లడించారు. అరెస్ట్ అయిన వారిలో అనంతపురంలోని రంగస్వామినగర్‌కు చెందిన చిక్కులూరు షెక్షావలి, అన్నమయ్య జిల్లా మొలకలచెరువుకు చెందిన గోవిందు సింహాద్రి, శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం డీఆర్ కాలనీకి చెందిన సి.మనోహర్ ఉన్నారు. చిక్కులూరు షెక్షావలి తపోవనంలో డీజే, లైటింగ్ షాపు పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. తక్కిన ఇద్దరికీ రాచానపల్లి, కొర్రపాడు గ్రామాల్లోని ప్రభుత్వ పాల కేంద్రాల్లో సూపర్‌వైజర్లుగా పని చేశారు. ప్రస్తుతం ఆ రెండు పాలకేంద్రాలు మూతపడడంతో పనిలేక అప్పులు చేసుకున్నారు. షెక్షావలికి జనరేటర్ అవసరం ఉందని తెలుసుకుని రాచానపల్లిలో మూతపడిన పాల కేంద్రంలోని జనరేటర్, అల్యూమినియం పాలక్యాన్లను ఎత్తుకెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో గత నెల 14న రాత్రి రెండు వాహనాల్లో వెళ్లి పాలడెయిరీ భవనం తాళాలు పగులగొట్టి జనరేటర్, పాలక్యాన్లను ఎత్తుకెళ్లారు.

**అరెస్ట్ ఇలా...**

రాచానపల్లి ప్రభుత్వ పాలడెయిరీ మేనేజర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన రూరల్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఎస్పీ జగదీష్ ఉత్తర్వుల మేరకు రూరల్ డీఎస్పీ వెంకటేశులు పర్యవేక్షణలో సీఐ శేఖర్‌కు వచ్చిన సమాచారం మేరకు ఎస్‌ఐ కె.రాంబాబు, సిబ్బందితో తపోవనం సమీపంలోని పెట్రోలుబంకు వద్ద ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. నిందితులను చాకచక్యంగా పట్టుకుని కేసును ఛేదించిన సీఐ, ఎస్‌ఐ, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

## పేద ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం





ఖైదీలతో సమస్యలు తెలుసుకుని, జైలు గదులను పరిశీలిస్తున్న జిల్లా న్యాయమూర్తి భీమారావు

- సబ్‌జైలు తనిఖీలో జిల్లా జడ్జి భీమారావు

హిందూపురం: ఆర్థిక ఇబ్బందులతో న్యాయవాదులను నియమించుకోలేని నిరుపేద ఖైదీలకు న్యాయ సహాయం అందిస్తామని ఉమ్మడి అనంతపురం జిల్లా జడ్జి ఈ. భీమారావు తెలిపారు. శనివారం ఆయన ఏడీజే కంపల్లె శైలజ, జిల్లా న్యాయాధికారి సంస్థ కార్యదర్శి రాజశేఖర్, సీనియర్ సివిల్ జడ్జి డి.వెంకటేశ్వర్లు నాయక్, ప్రత్యేక న్యాయమూర్తి రమణయ్యతో కలిసి స్థానిక సబ్‌జైలును తనిఖీ చేశారు. సౌకర్యాలపై ఆరా తీశారు. ఖైదీలకు వడ్డించే భోజనాన్ని పరిశీలించారు. భోజనం సిద్ధం చేసేందుకు ఉపయోగిస్తున్న సరుకుల నాణ్యతను పరిశీలించేందుకు శాంపిల్స్ పంపించాలని అధికారులను ఆదేశించారు. సబ్ జైలులో ఆన్‌లైన్ సౌకర్యం కల్పించాలని సబ్‌జైలు అధికారి హనుమన్నను ఆదేశించారు. అనంతరం పలువురు ఖైదీలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. తాము ఏ తప్పు చేయకపోయినా పోలీసులు ఉద్దేశపూర్వకంగా తమను ఇబ్బందులకు గురి చేస్తూ కేసులు పెట్టి జైళ్లకు పంపారని జిల్లా జడ్జి ఎదుట కన్నీటి పర్యంతమయ్యారు. తాము జైలులో ఉంటే తమపై కేసులు పెట్టిన వ్యక్తులు తమ కుటుంబీకులను ఇబ్బందులు పెడుతూ గ్రామంలోకి రాకుండా అడ్డు కుంటున్నారని వాపోయారు. వారి ఆవేదన విన్న జడ్జి అరెస్టు సమయంలోనే జడ్జి ముందు పోలీసుల వేధింపుల గురించి చెప్పాలన్నారు. ఏం జరిగిందో నిర్భయంగా చెప్పినప్పుడే న్యాయ సహాయం అందుతుందన్నారు. కారాగారంలో ఉన్న ఖైదీలంతా మార్పు చెంది సమాజంలోకి వెళ్లాలన్నారు. అనంతరం ఆయన స్థానిక సీనియర్ సివిల్ జడ్జి న్యాయస్థానం భవన సముదాయాన్ని పరిశీలించారు. కోర్టు ఆవరణంలో నిర్మిస్తున్న మరుగుదొడ్ల నిర్మాణాలు, వాటి నాణ్యత గురించి ఆర్ అండ్‌బీ ఇంజినీర్, కాంట్రాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. జిల్లా జడ్జి వెంట న్యాయవాదులు రాజశేఖర్, నవేరా, భరత్ సింహా తదితరులు ఉన్నారు.

## క్లుప్తంగా

### మాదక ద్రవ్యాలతో అనర్థాలు



మాట్లాడుతున్న ఆర్డీఓ కేశవ నాయుడు

**అనంతపురం అగ్రికల్చర్:** యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఆర్డీఓ కేశవ నాయుడు సూచించారు. శనివారం స్థానిక కృష్ణ దేవరాయ మీటింగ్ హాలులో యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వశాఖ, మై భారత్, నిగమ ఫౌండేషన్, ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో 'నషాముక్త భారత్ ఫర్ వికసిత్' అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. డిజిటల్ ప్రపంచంలో యువత మొబైల్, ఇంటర్‌నెట్‌కు బానిసై బంగారం లాంటి జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. మత్తు పదార్థాల వాడకం వల్ల జీవితాలు మరింత దిగజారిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీటి వాడకాన్ని పూర్తిగా తగ్గించి, దేశం, రాష్ట్రం అభివృద్ధికి తమ పరిజ్ఞానం ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా సంస్థల ప్రతినిధులు వసుంధర, బిసాతి భరత్, వి.మంజుల వెంకటేష్, సుంకర రమేష్, జీవన్ కుమార్, డాక్టర్ గురుగు బాలాజీ, భరణి రాము, పవన్ ఆచారి, అంబరీష్, నాగేంద్ర పాల్గొన్నారు.

### శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



పుల్లలరేవులో సోదాలు చేస్తున్న సీఐ శ్రీహర్ష

**రాప్తాడు:** శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా సత్ప్రవర్తనతో మెలగాలని రాప్తాడు సీఐ శ్రీహర్ష హెచ్చరించారు. జిల్లా ఎస్పీ జగదీష్, అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు ఆదేశాల మేరకు శనివారం మండలంలోని ఫ్యాక్షన్ గ్రామమైన పుల్లలరేవు గ్రామంలో నాకా బందీ (కార్డెన్ సెర్చ్) నిర్వహించారు. రౌడీ షీటర్స్, ట్రబుల్ మాంగర్స్ ఇళ్లలో సోదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరిలో మార్పు రావాలన్నారు. అసాంఘిక కార్యకలపాలతో శాంత్రిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని హెచ్చరించారు. సత్ప్రవర్తనతో ప్రశాంతంగా జీవనం సాగించాలని సూచించారు. అనవసరంగా ఘర్షణలకు దిగి కుటుంబాలకు దూరమై శిక్ష అనుభవించాల్సిన పరిస్థితి తెచ్చుకోవద్దన్నారు. ఫ్యాక్షన్ లో కూరుకుపోయి జైలు పాలైన వారి నుంచి పాఠాలు నేర్చుకోవాలన్నారు.

### శ్రీనివాస గోవిందా .. శ్రీ వేంకటేశా గోవిందా



వేంకటేశ్వరుడికి అభిషేకం చేస్తున్న అర్చకులు

**అనంతపురం కల్చరల్:** శ్రీనివాస శ్రీ వేంకటేశ నమో నమః అంటూ భక్తుల నామస్మరణతో వైకుంఠవాసుని దేవాలయాలు ప్రతిధ్వనించాయి. శ్రావణమాసంలో వచ్చిన రెండో శనివారం అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తులతో నగరంలోని వేంకటేశ్వరాలయాలు పోటెత్తాయి. ఆలయాల్లో శ్రీవారికి సమర్పించిన లడ్డూ ప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమం జరిగింది.

### చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

**చెన్నేకొత్తపల్లి:** వేరే గ్రామంలో చదవడం ఇష్టం లేక విషపు గుళికలు మింగి ఆత్మహత్యాయత్నం చేసిన విద్యార్థి జగన్మోహన్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలు.. మండల పరిధిలోని నామాల గ్రామానికి చెందిన జగన్మోహన్ (15)ను తల్లి సంజమ్మ ఇటీవల పెనుకొండ పట్టణంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతికి చేర్పించింది. అక్కడే వసతి గృహంలో ఉండాల్సి రావడంతో జగన్మోహన్ చదివేందుకు ఆసక్తి చూపలేదు. ఇటీవల గ్రామానికి వచ్చిన విద్యార్థి.. శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో విషపు గుళికలు మింగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడ్ని చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు శనివారం మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలిస్తుండగా.. మార్గమధ్యంలో మృతి చెందాడు.



# అమ్మపాలు.. అమృతం

- ముర్రుపాలతో వ్యాధి నిరోధక శక్తి
- బిడ్డ ఎదుగుదలకు ఎంతో మేలు
- ఈ నెల 7 వరకు కొనసాగనున్న 'తల్లిపాల వారోత్సవాలు'



**రాప్తాడు:** అమ్మ అనే పదంలోనే అప్యాయత, అనురాగం, మురిపం అనే సుగుణాలు మిళితమై ఉన్నాయి. తల్లిపాలే పిల్లలకు అమృతం. బిడ్డ శారీరక ఎదుగుదలకు తల్లిపాలు ఎంతగానో దోహదపడతాయి. నవజాత శిశువుకు బలం చేకూర్చే ఆహారం తల్లిపాలే అని నిపుణులు చెబుతున్నారు. అయితే ఈ విషయం తెలిసినా చాలా మంది తల్లులు పిల్లలకు ముర్రుపాలు ఇచ్చేందుకు ఇష్టపడటం లేదు. అపనమ్మకం, అభద్రతా భావం, కారణం ఏదైతేనేం బిడ్డకు పాలు అందించేందుకు అయిష్టత చూపుతున్నారు. ఫలితంగా పిల్లల్లో రోగనిరోధక శక్తి తగ్గి భవిష్యత్తులో వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో తల్లిపాల ఆవశ్యకతను తెలుపుతూ ఏటా వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. శిశు మరణాల నియంత్రణకు ప్రపంచ ఆరోగ్య సంస్థ విస్తృత ప్రచారం చేపట్టింది. అందులో భాగంగా ఏటా ప్రపంచ వ్యాప్తంగా ఆగస్టు మొదటి వారాన్ని తల్లిపాల వారోత్సవంగా 1992లో ఐక్యరాజ్యసమితి నిర్దేశించి 210 దేశాల్లో అమలు చేస్తుంది. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని ఆగస్టు 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల ఆవశ్యకతను అంగన్‌వాడీ వర్కర్లు వివరించనున్నారు.

**పోషకాలు మెండు..**

బిడ్డ పుట్టిన వెంటనే తప్పనిసరిగా తల్లిపాలను పట్టించాలి. ఆరు నెలల పాటు తల్లిపాలను మాత్రమే ఆహారంగా ఇస్తే బిడ్డకు తేలికగా జీర్ణమవుతుంది. తల్లిపాలు శుభ్రంగా ఎలాంటి క్రిములు లేకుండా ఉంటాయి. శ్వాసకోశ, అలర్జీ, ఆస్తమా, చర్మ వ్యాధుల నుంచి పిల్లలను రక్షిస్తాయి. బిడ్డ మానసిక, శారీరక వికాసానికి అవసరమైన పోషకాలు అందిస్తాయి. రోజులో బిడ్డకు 8-10 సార్లు పాలు ఇవ్వాలి. ఆరు మాసాల తర్వాత నుంచి బిడ్డకు తల్లిపాలతో పాటు అనుబంధ ఆహారం ఇవ్వాలి. రెండేళ్ల వరకు క్రమం తప్పకుండా పాలు పట్టాలి. ఇలా చేస్తే ఎలాంటి వ్యాధులు దరి చేరకుండా బిడ్డ ఎదుగుదల సక్రమంగా ఉంటుంది. కాన్పు అయిన కొద్ది రోజులు తల్లిపాలు చిక్కగా, పసుపు రంగులో ఉంటాయి. వీటినే ముర్రుపాలు అంటారు. ఇందులో ప్రొటీన్లు అధికంగా ఉంటాయి. వీటిలో రోగాలను ఎదుర్కొనే శక్తిని పెంచే గుణం ఉంటుంది. అలాగే విటమిన్ ఏ, బీలతో పాటు తగినంత ఐరన్ కూడా ఉంటుంది. ముర్రుపాలతో శిశువులు చక్కగా పెరుగుతారు. అప్పుడే పుట్టిన బిడ్డకు పేగులకు బలాన్ని ఇచ్చి, జీర్ణశక్తిని పెంచడంతో ఇవి తోడ్పడతాయి. కామెర్లు, విరేచనాల వంటి ప్రమాదకరమైన రోగాల నుంచి కాపాడతాయి.

### బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం

తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుంది. ప్రసవించిన మొదటి 5 నిమిషాల్లో వచ్చే పాలు తియ్యగా ఉంటాయి. ఇవి బిడ్డ దప్పికను తీరుస్తాయి. ఆ తర్వాత 5 నిమిషాల్లో వచ్చే పాలు చప్పగా ఉన్నా కొవ్వు పదార్థం ఎక్కువగా ఉండి బిడ్డ బరువు పెరిగేందుకు దోహదపడతాయి. ఈ సంవత్సరం 'తల్లిపాల సంస్కృతిని ప్రోత్సహిద్దాం' అనే నినాదంతో ఈ కార్యక్రమాలతో అవగాహన కల్పిస్తున్నాం.

- శివ కృష్ణ, వైద్యాధికారి, రాప్తాడు

### ముర్రు పాలు ఇవ్వాలి

బిడ్డ జన్మించిన అర గంటలోపే తల్లికి పాలు వస్తాయి. ఈ ముర్రుపాలను బిడ్డకు తప్పనిసరిగా పట్టించాలి. ఆరు నెలల వరకు బిడ్డకు తల్లిపాలు మాత్రమే పట్టించాలి. ఈ పాల ద్వారా బిడ్డకు అవసరమైన పోషకాలు విటమిన్లు, కాల్షియం, ప్రొటీన్ అందుతాయి. తల్లిపాల అవశ్యకతను తెలియజేసేందుకు ఏటా తల్లి పాల వారోత్సవాలను ఆగస్టు మొదటి వారంలో నిర్వహిస్తాం. ఈ సందర్భంగా ప్రతి ప్రాజెక్టు స్థాయిలో అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు, బాలింతలకు స్థానిక వైద్య సిబ్బందితో తల్లిపాల విశిష్టతను తెలియజేస్తూ ర్యాలీ, అవగాహన సదస్సులు నిర్వహిస్తాం.

– ఉమా శంకరమ్మ, ఐసీడీఎస్, సీడీపీఓ, అనంతపురం రూరల్

## ఆదర్శప్రాయుడు బళ్లారి రాఘవ



కళాకారుడిని అవార్డుతో సత్కరిస్తున్న దృశ్యం

**అనంతపురం కల్చరల్:** బళ్లారి రాఘవ రంగస్థల సేవలు ఆదర్శప్రాయం. ఆయన జిల్లాలో జన్మించడం మన అదృష్టమని వక్తలు కొనియాడారు. శనివారం రాత్రి స్థానిక లలిత కళాపరిషత్తులో బళ్లారి రాఘవ జయంతి ఘనంగా జరిగింది. ఎల్కేపి కార్యదర్శి పద్మజ జరిగిన కార్యక్రమంలో డీఆర్వో మలోల, మునిసిపల్ టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ సువర్ణ తదితరులు హాజరై మాట్లాడారు. రంగస్థలానికి ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. రాష్ట్రస్థాయి విభాగంలో భూపతి ధర్మారావు, రామలింగేశ్వర రావు, జిల్లా విభాగంలో వాల్మికి కుళ్లాయప్ప, మల్లెల జయరామ్‌కు బళ్లారి రాఘవ పురస్కారాలు అందజేశారు. అనంతరం సీనియర్ నటుడు ఎస్.ఎం.బాషా ఆధ్వర్యంలో ప్రదర్శించిన 'గోవు మాలచ్చిమి' సాంఘిక నాటకం ఆకట్టుకుంది. కార్యక్రమంలో లలితకళాపరిషత్తు ఉపాధ్యక్షుడు రామగోవింద సాగర్, కార్యనిర్వాహక సభ్యులు సోమిరెడ్డి, రామాంజనేయులు, దయానంద్, వెంకటరామి రెడ్డి, ఆనంద్, వరప్రసాద్, ఉంగరాల శ్రీనివాసులు, అస్లాం బాషా, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

**అనంతపురం:** జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం బళ్లారి రాఘవ జయంతి నిర్వహించారు. బళ్లారి రాఘవ చిత్రపటానికి ఏఆర్ అదనపు ఎస్పీ ఇలియాస్ బాషా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్ఐలు పవన్‌కుమార్, బాబు, ఆర్ఎస్ఐ మగ్బుల్, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

### 7న బహిరంగ వేలం

**రాప్తాడు:** అనంతపురం రూరల్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో ఉన్న ప్రభుత్వ జీపును (ఏపీ 02సీ 9914) ఈనెల 7వ తేదీన బహిరంగ వేలం వేస్తున్నట్లు అనంతపురం రూరల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ ఉమా శంకరమ్మ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అనంతపురం రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయం మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వారు జీపు విలువ రూ.20 వేలుగా నిర్ణయించడం జరిగిందన్నారు. ఈనెల 7వ తేదీన అనంతపురం రూరల్ ఐసీడీఎస్ కార్యాలయంలో బహిరంగ వేలం వేస్తామని వెల్లడించారు. ఆసక్తి ఉన్న వారు రూ.2 వేలను ఏదేని జాతీయ బ్యాంకులో శిశు అభివృద్ధి పథక అధికారిణి, ఐసీడీఎస్ ప్రాజెక్టు, అనంతపురం రూరల్ పేరు మీదుగా డీడీ తీయాలన్నారు. వేలానికి వచ్చేటపుడు ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకుని రావాలన్నారు.

## ఇంటర్ విద్యపై సైన్స్ అధ్యాపకులకు శిక్షణ



మాట్లాడుతున్న ఆర్ఐఓ వెంకటరమణ నాయక్

**అనంతపురం ఎడ్యుకేషన్:** ఇంటర్ విద్యలో తీసుకొచ్చిన నూతన సంస్కరణలపై అవగాహన కల్పించేందుకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్యాల జూనియర్ కళాశాలల సైన్స్ అధ్యాపకులకు శనివారం స్థానిక కేఎస్ఆర్ బాలికల కళాశాలలో శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా డిసెంబర్ వరకు సైన్స్ అధ్యాపకులైన గణితం, భౌతిక శాస్త్రము రసాయన శాస్త్రము, జీవశాస్త్రం అధ్యాపకులకు ప్రతి శనివారం శిక్షణ ఉంటుందని ఆర్ఐఓ వెంకటరమణ నాయక్ తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరంలో ఇంటర్ బోర్డు తీసుకొచ్చిన నూతన సంస్కరణలో భాగంగా మొదటి సంవత్సరం విద్యార్థులకు సిలబస్‌లో మార్పు, ప్రశ్నపత్రాల మార్పు, ఎలక్టివ్ సబ్జెక్టులు, అడిషనల్ సబ్జెక్టులు, ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు, ఈఏపీ సెట్, జేఈఈ మెయిన్స్, నీట్ లాంటి పోటీ పరీక్షలకు విద్యార్థులను ఏ విధంగా సన్నద్ధం చేయాలో అధ్యాపకులకు శిక్షణ ఇస్తామని ఆర్ఐఓ తెలిపారు. శిక్షణకు డీఆర్పీలుగా గణిత శాస్త్రం కృష్ణ కుమార్, శ్రీలక్ష్మి, సుబ్రహ్మణ్యం, భౌతిక శాస్త్రం లక్ష్మీ రంగయ్య, మల్లికార్జున, రసాయన శాస్త్రం నారాయణస్వామి, పి.రమేష్, వృక్ష శాస్త్రం డాక్టర్ రామాంజనేయులు, జంతుశాస్త్రం ఎస్.వెంకటస్వామి వ్యవహరించారు.

## హోటళ్లలో తనిఖీలు



మాసినేని గ్రాండ్‌లో నిల్వ ఉన్న ఆహారాన్ని పడేస్తున్న ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారులు

**అనంతపురం కార్పొరేషన్:** నగరంలోని మాసినేని గ్రాండ్‌తో పాటు సప్తగిరి సర్కిల్ రాజు రోడ్డులో ఉన్న శ్రీ కృష్ణ గ్రాండ్, ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న వెన్నెల హోటళ్లను శనివారం ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ ఎస్.శ్రీనివాస్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తస్లీమ్ హోటళ్లలో లోపాలు గుర్తించారు. రాజు రోడ్డులో ఉన్న మాసినేని గ్రాండ్‌ను తనిఖీ చేయగా అందులో వెజ్ మంచూరియా సరైన పద్ధతిలో ఫ్రీజర్‌లో స్టోరేజ్ చేయకపోవడంతో అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రముఖ హోటళ్లలో ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. సురక్షిత ప్రమాణాలు తప్పక పాటించాల్సిందేనన్నారు. హోటల్ వెన్నెలలో కలర్డ్ గోబీ ఉండటంపై అధికారులు నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అదేవిధంగా సప్తగిరి సర్కిల్ వైశ్య హాస్టల్ ఎదురుగా ఉన్న శ్రీ కృష్ణ గ్రాండ్‌లో వంట చేసే ప్రాంతంలో సురక్షిత ప్రమాణాలు పాటించకపోగా.. ఫ్రీజర్‌లోనే చట్నీ, తదితర ఆహార ప్రదార్థాలను స్టోరేజ్ చేశారు. ప్రజలకు ఇదే విధంగా అమ్మకాలు జరిపితే వారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు.

## సీసీ కెమెరాలతో చోరీల కట్టడి



శ్రీగణపతి సచ్చిదానంద ఆశ్రమంలో పూజల్లో పాల్గొన్న డీఎస్పీ వెంకటేశులు

**రాప్తాడు:** చోరీలు, నేరాల నియంత్రణకు 44వ జాతీయ రహదారిపై సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు పేర్కొన్నారు. శనివారం మండలంలోని బొమ్మెపర్తిలోని శ్రీగణపతి సచ్చిదానంద ఆశ్రమ ట్రస్ట్ తరపున ఆశ్రమ ట్రస్ట్ మెంబర్ నవీన్ దత్త రూ.2 లక్షలు విలువ చేసే 15 సీసీ కెమెరాలను పోలీసులకు వితరణ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. రోజు రోజుకూ చోరీలు, నేరాలు పెరుగుతున్నాయన్నారు. నేరగాళ్లు కొత్త ఆలోచనలతో నేరాలు చేస్తున్నారని, వారిని కట్టడి చేసేందుకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. చాలా కేసులు ప్రస్తుతం సీసీ ఫుటేజీలతోనే పరిష్కారం అవుతున్నాయన్నారు. శ్రీగణపతి సచ్చిదానంత ఆశ్రమ ట్రస్ట్ నిర్వాహకులు వితరణ చేసిన 15 సీసీ కెమెరాలను మరూరు టోల్ ప్లాజా నుంచి ప్రసన్నాయపల్లి సమీపంలోని డాల్ఫిన్ హోటల్ వరకు ఏర్పాటు చేస్తామన్నారు. సీసీ కెమెరాలను సామాజిక బాధ్యతగా గుర్తించి ప్రతి ఒక్కరూ తమ ఇళ్లు, హోటళ్లు, వ్యాపారాలు చేసుకునే చోట, అపార్ట్‌మెంట్లలో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అంతకుముందు డీఎస్పీ వెంకటేశులు, సీఐ శ్రీహర్ష తదితరులు శ్రీ గణపతి సచ్చిదానంద స్వామిజీ మాతృమూర్తి జయలక్ష్మి మాత, నరహరతీర్థులకు ప్రత్యేక పూజలు చేయించి మొక్కులు తీర్చుకున్నారు.

## ముర్రుపాలే బిడ్డకు శ్రీరామ రక్ష



రాప్తాడు: సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్‌హెచ్‌పీ ప్రసన్న



సూచనలిస్తున్న సీడీపీఓ ఉమాశంకరమ్మ

**రాప్తాడు:** తల్లి ముర్రుపాలే బిడ్డకు శ్రీరామ రక్ష అని ఎంఎల్‌హెచ్‌పీ ప్రసన్న, అంగన్‌వాడీ కార్యకర్త దండు యల్లమ్మ పేర్కొన్నారు. శనివారం మండలంలోని ప్రసన్నాయపల్లి పంచాయతీలోని చిన్మయనగర్-1 అంగన్‌వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బిడ్డకు సక్రమంగా తల్లిపాలు అందించినప్పుడే వారు ఆరోగ్యంగా పెరుగుతారన్నారు. తల్లిపాలు తాగని పిల్లలు అనారోగ్యం పాలవుతారన్నారు. ప్రతి ఒక్కరు బిడ్డ పుట్టిన అరగంట నుంచే తల్లిపాలు ఇవ్వాలన్నారు. ఆరు నెలలు వరకు బిడ్డకు తల్లిపాలు ఇవ్వాలని.. ఏడో నేల నుంచి ఇంట్లో వండుకున్న ఆహార పదార్థాలను తల్లిపాలతో పాటు రెండు సంవత్సరాల వరకు ఇవ్వాలని సూచించారు. పౌష్టికాహారం, ప్రభుత్వాసుపత్రిలో ప్రసవం, తల్లిపాల విశిష్టత, టీకాలు, 108, పిల్లల సంరక్షణ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. గర్భిణులు తాజా కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, గుడ్లు, చేపలు, పాలు, తదితర పౌష్టికాహారం తీసుకోవాన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం చంద్రకళ, అంగన్‌వాడీ హెల్పర్ కురుము విజయలక్ష్మి, ఆశా కార్యకర్తలు శివలక్ష్మి, నాగేంద్రమ్మ, వీరమ్మ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

**సోమనాథ్ నగర్‌లో..**

**అనంతపురం రూరల్:** తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సీడీపీఓ ఉమాశంకరమ్మ అన్నారు. శనివారం సోమనాథ్ నగర్‌లోని 1, 2 అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రపంచ తల్లి వారోత్సవాలను నిర్వహించారు. తల్లిపాలు బిడ్డలకు తాపడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష అన్నారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టించడం వల్ల బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. గర్భిణులు తాజా కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, గుడ్లు, చేపలు, తీసుకోవాన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

### పేదలకు అండగా ఎంఎస్ఎస్ సేవా సంస్థ



ప్రమాద బీమా బాండ్లు అందజేస్తున్న ఎంఎస్ఎస్ సేవా సంస్థ సభ్యులు

**అనంతపురం రూరల్:** పేద ప్రజలకు ఆర్థిక భరోసా కల్పించి వారి ఉన్నతికి పాటుపడటమే ఎంఎస్ఎస్ సేవా సంస్థ లక్ష్యమని ఎంఎస్ఎస్ సేవా సంస్థ అధ్యక్షుడు సాదిక్‌వలి అన్నారు. రుద్రంపేట పంచాయతీలో ఉన్న పేదలకు ప్రధానమంత్రి సురక్ష బీమా పథకానికి సంబంధించిన ఇన్సూరెన్స్ ప్రీమియం మొత్తాన్ని ఎంఎస్ఎస్‌సేవా సంస్థ చెల్లించింది. శనివారం లబ్ధిదారులకు బాండ్లను అందజేశారు. కార్యక్రమంలో ఎంఎస్ఎస్ సేవా సంస్థ సభ్యులు షెక్షావలి, రుద్రంపేట ఎంపీటీసీ-4 సభ్యురాలు మహబూబీ తదితరులు పాల్గొన్నారు.

### తప్పిదాలు సవరించాలి

**అనంతపురం కార్పొరేషన్:** సచివాలయ ఉద్యోగుల సీనియారిటీ జాబితాలో జరిగిన తప్పిదాలను సవరించాలని సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు పేర్కొన్నారు. శనివారం నగరపాలక సంస్థలో కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. డేటాఫ్ జాయినింగ్‌లో కొన్ని మునిసిపాలిటీల్లో ప్లేస్‌మెంట్ ఆర్డర్ కంటే ముందుగా తేదీని నమోదు చేశారన్నారు. ఏపీపీఎస్సీ ద్వారా డిపార్ట్‌మెంట్ టెస్టులు పాస్ అయిన వారిని కూడా పాసు కాలేదని పేర్కొన్నారన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు డి.సుధాకర్, లక్ష్మీనారాయణ, బి.రామకృష్ణ, మల్లికార్జున, చంద్ర, శివశంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

**రాప్తాడు రూరల్:** ఇళ్లు, వ్యవసాయ మోటర్లకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బాల రంగయ్య, రాప్తాడు రూరల్ ప్రాంతీయ కార్యదర్శి రామాంజనేయులు డిమాండ్ చేశారు. 'స్మార్ట్ మీటర్ల రద్దు, ఇంధన చార్జీలు ట్రూ ఆఫ్ చార్జీల సర్దుబాటు, విద్యుత్ రంగం ప్రైవేటీకరణ రద్దు' తదితర అంశాలపై ఈనెల 5న విద్యుత్ కార్యాలయాల ముందు తలపెట్టిన నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. శనివారం అనంతపుం రూరల్ కందుకూరులో కరపత్రాలు, బుక్‌లెట్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యుత్ విధానం ప్రజలకు చాలా భారమైందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ కంపెనీలకు లాభాలు తెచ్చిపెడుతున్నాయన్నారు. ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు. ఎన్నికలకు ముందు జగన్ ప్రభుత్వం రూ.35 కోట్ల భారాన్ని ప్రజలపై మోపారని.. స్మార్ట్ మీటర్లు పగలగొట్టండి, సోలార్ విద్యుత్ ప్రైవేటీకరణను అదానీ కంపెనీలను రద్దు చేస్తామంటూ హామీలు ఇచ్చిన చంద్రబాబు ఈరోజు చేస్తోంది ఏమిటని నిలదీశారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే రూ.16 వేల కోట్లు ప్రజల నెత్తిన రుద్దారన్నారు. ప్రభుత్వ వైఖరిని ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం ప్రాంతీయ కమిటీ సభ్యులు పోతలయ్య, సుబ్బారావు, మల్లేష్, ప్రకాష్, వంశీ, నారాయణ స్వామి పాల్గొన్నారు.


## నేడు కృష్ణ మ్యూజికల్ నైట్

**అనంతపురం కల్చరల్:** అనంత నాగ్ స్వర్గ్ కల్చరల్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఆదివారం కృష్ణ మ్యూజికల్ నైట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు హైమావతి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కేవలం మహిళలు మాత్రమే ప్రయోగాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆకాశంలో ఒక తార' పేరుతో సాయంత్రం 5:30 గంటలకు ప్రారంభమయ్యే సూపర్‌స్టార్ సంగీత విభావరిలో అందరూ పాల్గొనాలని సూచించారు.

### ఉపాధ్యాయులకు వీడ్కోలు

**కనగానపల్లి:** మండలంలోని ముత్తవకుంట ఆదర్శ పాఠశాలలో పని చేస్తూ బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను స్థానిక గ్రామస్తులు, ఉపాధ్యాయులు ఘనంగా వీడ్కోలు పలికారు. శనివారం స్థానిక పాఠశాలలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి బదిలీపై వెళ్తున్న మోహన్ రెడ్డి, నాగరాణిని శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ అరుణమ్మ, ప్రధానోపాధ్యాయుడు రవి, ఉపాధ్యాయులు కిష్టయ్య, నాగభూషణ, మారుతి, పాల్గొన్నారు.

### 'పారిపోయే చరిత్ర పరిటాల కుటుంబానిదే'



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

**కనగానపల్లి:** కరోనా సమయంలో అష్టకష్టాలు పడుతున్న ప్రజలను వదిలేసి సంవత్సరాల పాటు ఇతర ప్రాంతాలకు పారిపోయిన చరిత్ర పరిటాల కుటుంబానికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అంకె లక్ష్మన్న విమర్శించారు. రాప్తాడు నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిపై స్థానిక టీడీపీ ఎమ్మెల్యే పరిటాల సునీత చేసిన అసత్య అరోపణలను ఖండించారు. శనివారం మామిళ్లపల్లిలో ఆయన మండల వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారన్నారు. ప్రజల పక్షాన నిరంతరం పోరాటం చేసే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారు. చట్ట ప్రకారం అతను బెయిలు తెచ్చుకోవటానికి కోర్టుకు వెళ్లితే ఎక్కడికో పారిపోయారంటూ విమర్శలు చేయటం తగదన్నారు. సమావేశంలో రాప్తాడు వైస్ ఎంపీపీ రామాంజనేయులు, వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు గంగుల సుధీర్‌రెడ్డి, నియోజకవర్గ యూత్ కన్వీనర్ అమరనాథ్ రెడ్డి, రైతు విభాగం అధ్యక్షుడు పెద్దిరెడ్డి, మాజీ డైరక్టర్ దాసరి ప్రభాకర్, ముక్తాపురం రమణారెడ్డి, వెంకట నారాయణరెడ్డి, ఓబిలేసు, జనార్దన్‌రెడ్డి, నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఓబీసీ మహాసభ జయప్రదం చేయాలి

**అనంతపురం రూరల్:** ఈనెల 7వ తేదీన గోవాలో నిర్వహించనున్న అఖిల భారత జాతీయ ఓబీసీ 10వ మహాసభను జయప్రదం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు భాస్కర్ బాబు పిలుపునిచ్చారు. శనివారం ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో చలో గోవా కార్యక్రమ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలను నిలువునా మోసం చేస్తున్నాయని మండిపడ్డారు. దేశ వ్యాప్తంగా బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించి డిమాండ్ల సాధన, భవిష్యత్తు కార్యచరణపై చర్చించడం జరుగుతుందన్నారు. గోవాలోని శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్న మహాసభకు కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, అఖిల పక్ష నాయకులు హాజరవుతన్నారన్నారు. జిల్లాలోని బీసీలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి సురేంద్ర గౌడ్, సహాయ కార్యదర్శి డీకే రామలింగం, నాయకులు విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

### పరువు హత్యల నివారణకు చట్టం చేయాలి

**అనంతపురం టవర్‌క్లాక్:** ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో పరువు హత్యల నివారణకు ప్రత్యేక బిల్లు ప్రవేశపెట్టి చట్టం తీసుకుని రావాలని ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రవి శంకర్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఎన్జీఓ హోంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో సుప్రీం కోర్టు కులాంతర వివాహాలు, మతాంతర వివాహాలు చట్టబద్ధమైనవని.. దేశ శ్రేయస్సు, ఐక్యతకు చాలా అవసరమని తెలపడం జరిగిందన్నారు. కులాంతర వివాహాలు జరిగినప్పుడు వేధింపులు కానీ హింస కాని జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించిందన్నారు. కొద్ది రోజుల క్రితం తమిళనాడు, కడప జిల్లాలో హింసాత్మక సంఘటనలు చోటు చేసుకున్నాయన్నారు. అందుకే పార్లమెంట్‌లో చట్టం తీసుకరావాలని కోరారు. కార్యక్రమంలో సుబ్బన్న, సురేష్ బాబు పాల్గొన్నారు.